ఎన్నికల తర్వాత రేవంత్ సర్కార్ డౌటే

సీఎం సీటును కోమటిరెడ్డి లాక్కుంటారు

ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు

బోధన్, ఫిబ్రవరి 29: పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఉం టుందో.. పోతుం దో తెలియదని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి కుర్చీని లాక్కునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, కోమటిరెడ్డి నుంచి గుంజుకునేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాచుకు కూర్చున్నారని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్స్ ఎదుట గురువారం చెరుకు రైతులతో అర్వింద్ మాట్లాడుతూ...ఎన్నికలకు ముందు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు రైతుబంధు నిధులు ఉంచితే.. వాటిని బిల్లుల రూపంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీసుకున్నారని ఆరోపించారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణ విషయంలో కాంగ్రెస్ సర్కార్ స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు.

ఏపీ భవన్ వాటాల్లో తెలంగాణకు నష్టం?

- ఢిల్లీలో ఏపీ భవన్ విభజన పూర్తి!
- పరస్పర అంగీకారంతో ఆస్తుల పంపకం
- గెజిట్ విడుదలే తరువాయి
- ఢిల్లీలో తెలంగాణభవన్ నిర్మాణానికి సన్నాహాలు

హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన పూర్తయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం మొత్తం ఆస్తిలో ఏపీకి 58.32%, తెలంగాణకు 41.68% చెందే విధంగా రెండు రాష్ట్రాలు పరస్పరం అంగీకరించి కేంద్రానికి తమ సమ్మతిని తెలియజేశాయి. దీంతో కేంద్ర హోంశాఖ దీనికి ఆమోదముద్ర వేస్తూ గెజిట్‌ను విడుదల చేయడమే తరువాయి అని అధికారవర్గాలు తెలిపాయి. అయితే, రాష్ట్రానికి నష్టం చేకూర్చే ప్రతిపాదనకు ప్రభుత్వం సమ్మతించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలోని ఏపీ భవన్ సుమారు 19 ఎకరాలకుపైగా విస్తరించి ఉండగా, దీని విలువ రూ.7,110 కోట్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో ఏపీకి 58.32%, తెలంగాణకు 41.68% చొప్పున ఆస్తులను పంపిణీ చేయాల్సి ఉన్నది. ఈ లెక్కన ఏపీకి సుమారు 11 ఎకరాలు, తెలంగాణకు సుమారు 8 ఎకరాలకుపైగా భూమి రావాల్సి ఉంటుంది. విభజనలో భాగంగా ఢిల్లీ అశోకా రోడ్డులోని చారిత్రక హైదరాబాద్ హౌస్‌ను ఆనుకొని ఉన్న మూడు ఎకరాల్లోని శబరి, స్వర్ణముఖి బ్లాక్‌ల్లో వాటాతోపాటు అందులోని 5.24 ఎకరాల స్థలాన్ని తెలంగాణకు కేటాయించినట్టు తెలిసింది. ఇది ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న 41.68 శాతానికి సమానం కావడంతో ఏపీ సైతం ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదన తెలంగాణకు నష్టమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి హైదరాబాద్ హౌస్‌తోపాటు ఇక్కడి మొత్తం స్థలం తెలంగాణకే చెందుతుందని, కేంద్రం హైదరాబాద్ హౌస్‌ను తీసుకొని దానికి ప్రత్యామ్నాయంగా ఈ ఐదు ఎకరాల ఖాళీ స్థలాన్ని కేటాయించిందని అధికారవర్గాలు చెప్తున్నాయి. అయితే, పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా 41.68% కింద హైదరాబాద్ హౌస్‌కు ఆనుకొని ఉన్న మొత్తం స్థలాన్ని తెలంగాణకే కేటాయించి ఏపీకి మరోచోట స్థలం కేటాయించాలని గతంలో తెలంగాణ ప్రభుత్వం కోరింది. దీనికి అటు కేంద్రంతోపాటు ఏపీ ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో గత కొంతకాలంగా ఈ వ్యవహారం నానుతూ వస్తున్నది. ఈ నేపథ్యంలో తాజాగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ హౌస్‌ను ఆనుకొని ఉన్న మూడు ఎకరాల్లోని శబరి, స్వర్ణముఖి బ్లాక్‌ల్లో వాటాతోపాటు అందులోని 5.24 ఎకరాల స్థలం తీసుకునేందుకు అంగీకరించినట్టు, దీనికి ఏపీ కూడా సానుకూలంగా స్పందించడంతో ఇరు రాష్ట్రాల అధికారులు విభజనకు సంబంధించి ఒప్పందాన్ని కేంద్రానికి సమర్పించినట్టు అధికారులు తెలిపారు.

ఢిల్లీ తెలంగాణభవన్ నిర్మాణానికి సన్నాహాలు

ఏపీ భవన్ విభజన పూర్తైన వెంటనే అక్కడ నూతనంగా తెలంగాణభవన్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు అధికారులు తెలంగాణభవన్ ఉన్న ప్రాంగణాన్ని పరిశీలించి నూతన భవనం నిర్మాణంపై చర్చించారు. శబరి, స్వర్ణముఖి బ్లాక్‌లు పురాతనమైనవి కావడంతో వాటిని తొలగించి నిర్మించాలా? లేక 5.24 ఎకరాల ఖాళీ జాగాలో నూతన భవనం నిర్మించాలా? అనే అంశంపై అధికారులు సందిగ్ధంలో ఉన్నారు. ఎందుకంటే శబరి, స్వర్ణముఖి బ్లాక్‌ల్లో ఏపీకి కూడా వాటా ఉండటంతో వాటి తొలగింపు సాధ్యమవుతుందా? లేదా? అనేది అర్థంకావడంలేదని అధికారులు తెలిపారు. తెలంగాణభవన్ తెలంగాణ సంస్కృతీ-సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టంచేయడంతో అదే విధంగా నిర్మించాలని నిర్ణయించారు.

5 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆర్ కృష్ణయ్య వినతి

కాచిగూడ, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలోని 20 లక్షల మంది విద్యార్థుల రూ.5 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ రఘురాంకు ఇండియా-యూకే అచీవర్స్ అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు, కిమ్స్-ఉషా ముళ్లపూడి బ్రెస్ట్ క్యాన్సర్ వ్యవసాపక డైరెక్టర్ డాక్టర్ రఘురాం ప్రతిష్ఠాత్మక ఇండియా-యూకే అచీవర్స్ అవార్డును కైవసం చేసుకున్నారు. విద్య, విజ్ఞానశాస్త్రం, ఆవిష్కరణల రంగాల్లో ఉన్నత సేవలు అందించినవారికి నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్నీ యూనియన్, బ్రిటిష్ కౌన్సిల్, బ్రిటన్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ అవార్డును అందజేసింది.

ప్రాజెక్టు జీనోమ్ విజయవంతం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): రోగాలను వేగంగా నిర్ధారించడం, మెరుగైన మందుల తయారు చేయడమే లక్ష్యంగా సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)తో కలిసి పలు పరిశోధన సంస్థలు చేపట్టిన ప్రాజెక్ట్ జీనోమ్ విజయవంతంగా ముగిసింది. సీసీఎంబీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కుమారస్వామి తంగరాజన్ నేతృత్వంలో సాగిన ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధకులు 10 వేల జన్యువుల క్రమాన్ని నమోదు చేసినట్టు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.

సింగర్ చిన్మయిపై గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 29: భారతదేశాన్ని అగౌరవపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన సింగర్ చిన్మయి శ్రీపాదపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హెచ్‌సీయూ విద్యార్థి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చలనచిత్ర సీనియర్ నటి అన్నపూర్ణమ్మ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలకు కౌంటర్‌గా చిన్మయి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పెట్టిన ఈ పోస్టులో 'భారతదేశం స్టుప్పిడ్ కంట్రీ (చెత్త దేశం). ఈ దేశంలో పుట్టడం నా ఖర్మ' అంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని హెచ్‌సీయూ విద్యార్థి పేర్కొన్నారు.

ముగిసిన రేషన్ కేవైసీ గడువు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): రేషన్ కేవైసీ గడువు గురువారం ముగిసింది. అయితే మళ్లీ గడువు పెంపుపై కేంద్రం ఎలాంటి ఉత్తర్వులివ్వలేదు. రాష్ట్రంలో రేషన్ కేవైసీ సుమారు 85% వరకు పూర్తయినట్టు తెలిసింది.

'బట్టలు ఉతికేపని రజక సొసైటీలకే..'

హైదరాబాద్, ఫిబ్రవరి29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వ సంస్థల్లో బట్టలుతికే పనిని రజక సొసైటీలకు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్స్, రాష్ట్ర, జిల్లాల్లోని స్పోర్ట్స్ హాస్టల్స్, ఆలయాలు, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లు, పోలీస్ డిపార్ట్‌మెంట్లు, బెటాలియన్లలో బట్టలు ఉతికే పని కాంట్రాక్టర్లకు గాకుండా ఇకపై రజక సొసైటీలకే దక్కనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంబీసీ సంఘాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాకాఫ్‌కు 6, కేంద్రీయ భండార్‌కు 4 లాట్లు

- ధాన్యం టెండర్ల వివరాలు బహిర్గతం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): నిరుడు యాసంగి సీజన్‌కు సంబంధించి పౌరసరఫరాల సంస్థ మొత్తం 35 లక్షల టన్నుల ధాన్యాన్ని 12 లాట్లుగా విభజించి వేలం వేసింది. వాటిలో ఏ కంపెనీకి ఎన్ని లాట్లు దక్కాయి, ఏ లాట్ ఎంత ధర పలికిందన్న వివరాలు బహిర్గతమయ్యాయి. దొడ్డు ధాన్యమున్న తొలి 11 లాట్లలో 10 లాట్లను రెండు సంస్థలే కైవసం చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్‌మెంట్ ప్రాసెసింగ్ అండ్ రీటైలింగ్ కో-ఆపరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (నాకాఫ్) సంస్థ 2, 4, 6, 7, 10, 11 లాట్ల ధాన్యాన్ని దక్కించుకోగా.. కేంద్రీయ భండార్ సంస్థ 1, 5, 8, 9 లాట్ల ధాన్యాన్ని దక్కించుకున్నది. అంటే.. ఈ రెండు సంస్థలే 30 లక్షల టన్నుల ధాన్యాన్ని కైవసం చేసుకున్నాయి.

లైన్‌మెన్ పోస్టుల భర్తీ పాత జిల్లాలే ప్రాతిపదిక: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ కోసం 2019లో టీఎస్ఎస్పీడీసీఎల్ జారీచేసిన నోటిఫికేషన్‌లో ఇప్పటికీ భర్తీ చేయని 550 పోస్టులను పాత జిల్లాల ప్రాతిపదికపై భర్తీ చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రాష్ట్రపతి వెలువరించిన నూతన ఉత్తర్వుల ప్రస్తావన లేకుండా పాత జిల్లాల ప్రాతిపదికనే ఆ పోస్టులను భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నోటిఫికేషన్ జారీ తర్వాత 1,950 పోస్టులను భర్తీ చేసిన టీఎస్ఎస్పీడీసీఎల్.. మిగిలిన పోస్టుల భర్తీలో కొత్త జిల్లా ప్రాతిపాదికన స్థానికులకు 95% రిజర్వేషన్ కల్పించనున్నట్టు స్పష్టం చేసింది. దీన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేయడంతో హైకోర్టు పై తీర్పును వెలువరించింది.

ఏసీబీ కస్టడీకి గొర్రెల స్కాం కేసు నిందితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): గొర్రెల స్కాం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు చంచల్‌గూడ జైలుకు గతంలో తరలించిన సంగతి తెలిసిందే. వీరిని ఏసీబీ అధికారులు గురువారం తన కస్టడీలోకి తీసుకొన్నారు. ఉస్మానియా దవాఖానలో వైద్యపరీక్షలు నిర్వహించి, బంజారాహిల్స్‌లోని ఏసీబీ ఆఫీసుకు విచారణ కోసం తరలించారు.

ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్‌గా డాక్టర్ జీ చిన్నారెడ్డి గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై ఉన్న నమ్మకంతో ప్రజావాణి అదనపు బాధ్యతలు అప్పగించారని చిన్నారెడ్డి తెలిపారు.

178 మంది వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలు

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్వో వ్యవస్థ రద్దయిన నేపథ్యంలో వారి విద్యార్హతల ఆధారంగా ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 178 మంది వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలు వర్తించనున్నాయి. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ కిందిస్థాయి నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పోలీస్, స్టాఫ్ నర్స్, గురుకులం, సింగరేణిల్లో మూడు నెలల్లోనే 23 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం, తెలంగాణ వీఆర్వోల జేఏసీ ధన్యవాదాలు హర్షం వ్యక్తం చేశాయి.

గచ్చిబౌలి డ్రగ్స్ కేసులో మరో ఇద్దరు అరెస్టు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 29: గచ్చిబౌలి ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పార్టీకి డ్రగ్స్ సప్లయ్ చేసిన నగరానికి చెందిన మీర్జాపహీద్ బేగ్‌తోపాటు వివేకానందకు డ్రగ్స్ చేరవేసిన అతని డ్రైవర్ గద్దల ప్రవీణ్‌ను అరెస్టు చేశారు. ఈ ఇద్దరు సహా ఇప్పటి వరకు ఈ కేసులో ఆరుగురు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ఏ1గా ఉన్న మంజీరా గ్రూప్ డైరెక్టర్ గజ్జెల వివేకానందకు డ్రగ్స్ చేరవేసిన అతని డ్రైవర్ గద్దల ప్రవీణ్‌తోపాటు పార్టీకి డ్రగ్స్ అందించిన సప్లయర్ సయ్యద్ అబ్బాస్ అలీ జాఫ్రీకి కొకైన్ ఇచ్చిన మరో నిందితుడు పాతబస్తీకి చెందిన మీర్జాపహీద్ బేగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వహీద్ నుంచి అబ్బాస్ కొకైన్ తీసుకొని డ్రైవర్ ప్రవీణ్ ద్వారా వివేకానందకు చేరవేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

రేషన్‌కార్డులను మాత్రం జారీ చేయడం లేదు. అప్పుడిస్తాం..ఇప్పుడిస్తాం.. అంటూ ప్రకటనలు చేయడమే తప్పా.. ప్రక్రియ మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ఓవైపు పథకాలకు రేషన్‌కార్డును తప్పనిసరి చేయడం, మరోవైపు కొత్తవాటిని జారీ చేయకపోవడంతో అర్హులైన వారు సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోతున్నారు. దీంతో తమకు కొత్తకార్డులు జారీ చేయాలంటూ అర్హులైన వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికలొస్తే మరో 3 నెలలు జాప్యం?

కొత్త రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు నెలలు కావస్తున్నది. అయినా కొత్త రేషన్‌కార్డు జారీపై ఇప్పటివరకు ఎలాంటి ప్రక్రియ మొదలు పెట్టలేదు. మరో వారం పది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నది. ఒక వేళ షెడ్యూల్ విడుదలైతే కొత్త పథకాలు అమలు చేసే అవకాశం ఉండదు. ఇదే జరిగితే కొత్త రేషన్‌కార్డుల కోసం మరో మూడు నెలల పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అనే మాటే ఉండదు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాలనే డిమాండ్ వ్యక్తమవుతున్నది.

అర్హుల్లో ఆందోళన.. కొత్త కార్డులపై నిలదీత

ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండురోజుల క్రితం రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ రెండు పథకాలకు కూడా తెల్ల రేషన్‌కార్డును తప్పనిసరి చేసింది. తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే ఈ పథకాలకు అర్హులని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అన్ని అర్హతలున్నా.. కేవలం తెల్ల రేషన్‌కార్డు లేకపోవడంతో ఆ పథకాలను అందులేకపోతున్నారు. దీంతో అర్హుల్లో అందోళన వ్యక్తమవుతున్నది. ఈ విధంగా ఓవైపు ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుంటే అర్హత కలిగిన వాళ్లు అసంతృప్తికి లోనవుతున్నారు. తమకు కూడా తెల్ల రేషన్‌కార్డు జారీ చేస్తే.. పథకాల ద్వారా లబ్ధిపొందే వాళ్లం కదా అంటూ ప్రశ్నిస్తున్నారు. మరీ ముఖ్యంగా గ్రామాల్లో కొత్త కార్డులు ఎప్పుడిస్తారంటూ గ్రామస్థాయి అధికారులను, నేతలను ప్రశ్నిస్తున్నారు. అర్హులైన వారికి కొత్త కార్డులు ఇవ్వకుండా పథకాలను ఏ విధంగా అమలు చేస్తారంటూ నిలదీస్తున్నారు. మార్చి 1 నుంచి ఈ రెండు పథకాలు అమల్లోకి రానున్నాయి. ఆ తర్వాత గ్రామాల్లో కొత్త రేషన్‌కార్డు జారీ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 6.47 లక్షల కొత్త కార్డులు జారీ

కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా 6.5 లక్షల కొత్త కార్డులను జారీ చేసింది. తద్వారా సుమారు 21 లక్షల మందికి లబ్ధి చేకూరింది. 2021లో రికార్డు స్థాయిలో ఏకకాలంలో 3.11 లక్షల కొత్త రేషన్ కార్డులను పౌరసరఫరాల శాఖ జారీ చేసింది. 2021 జులై 26న కొత్త రేషన్‌కార్డుల పంపిణీని అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించి.. లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. వాస్తవాలు ఈ విధంగా ఉంటే కాంగ్రెస్ నేతలు మాత్రం గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగా ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదంటూ నిరాధార ఆరోపణలు చేయడం గమనార్హం.

జాప్యంపై అనుమానాలు!

తెల్ల రేషన్‌కార్డుల జారీలో ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్‌కార్డుల సంఖ్యను పెంచడం వల్ల పథకాల లబ్ధిదారులు పెరిగి... ప్రభుత్వంపై ఆర్థికభారం పెరుగుతుందనే ఆందోళనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా 2.82 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు మరో 9 లక్షల వరకు రేషన్‌కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తే లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నది. ఈ ఆర్థిక భారాన్ని తప్పించుకునే ప్రయత్నంలో భాగంగానే కొత్త రేషన్‌కార్డుల జారీని మొదలు పెట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. రెండు నెలల క్రితం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులోనే ప్రత్యేక కాలమ్ పెట్టడం ద్వారా రేషన్‌కార్డుల దరఖాస్తులను స్వీకరించేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాచమన్‌గా చేస్తూ.. మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

మంచిర్యాల జిల్లా ప్రవీణ్ ఘనత

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29: పట్టుదల, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ప్రవీణ్ అనే యువకుడు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రిసర్చ్ సెంటర్ (ఈఎంఆర్‌సీ)లో రాత్రిపూట వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ పదిరోజుల వ్యవధిలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. ఇటీవలే తెలంగాణ గురుకుల విద్యాలయాల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొన్కల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ డిగ్రీ వరకు జెన్నారంలో పూర్తి చేశారు. తండ్రి పెద్దులు మేస్త్రీ, తల్లి పోసమ్మ బీడీ కార్మికురాలిగా పని చేస్తూ ప్రవీణ్‌ను చదివించారు. ఎంకాం, బీఈడీ, ఎంఈడీ ఓయూ క్యాంపస్‌లోనే చదువుకొన్నారు. ఖర్చుల కోసం ఈఎంఆర్‌సీలో ఐదేండ్లుగా వాచ్‌మన్‌గా ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక

పోటీ పరీక్షల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువత ప్రతిభ

మెట్‌పల్లి రూరల్/చందుర్తి/తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: కరీంనగర్ జిల్లా పరిధిలోని ముగ్గురు అభ్యర్థులు.. ఇటీవల వెల్లడించిన గురుకుల పరీక్షల ఫలితాల్లో ప్రతిభ ప్రదర్శించారు. ఒకేసారి రెండు చొప్పున ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యి సత్తా చాటారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లికి చెందిన కొత్తపల్లి (కొడిమ్యాల) పావని గురుకుల జేఎల్,పీజీటీ పరీక్షలు రాసింది. గురువారం జూనియర్ లెక్చరర్ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయగా.. మ్యాథమెటిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 139వ ర్యాంకు, పీజీటీ పోస్టుకు 41వ ర్యాంకు సాధించింది. పావనిని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన అంచ వనజ (అర్చన) గురుకుల జేఎల్, పీజీటీ పోస్టులకు ఎంపికైంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామానికి చెందిన జినుక శ్రీనివాస్ గురుకుల పీజీటీ ఇంగ్లిష్, జేఎల్ ఫలితాల్లో సత్తాచాటి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. వీరిని స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

విజయవంతమైన 50 వ రోజు

సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 8.00AM
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అంజలి 70 ఎంఎం ఎ/సి - సికింద్రాబాద్ 8.00AM
కుమార్ 70 ఎంఎం ఎ/సి - కాచిగూడ 8.00AM
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 7.10PM
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 1.15PM
PVR గలేరియా - పంజాగుట్ట 4.05PM
PVR పీవిఆర్ - మూసారంబాగ్ 4.15PM
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 4.45PM
INOX జి.ఎస్.ఎమ్ - మలీనాగూడ 7.10PM
INOX సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ 1.20PM
Cinepolis లులు మాల్ - కూకట్‌పల్లి 10.45PM
Cinepolis CCPL - మల్కాజ్‌గిరి 7.15PM
Cinepolis డి.ఎస్.ఎల్. - ఉప్పల్ 7.25PM
Cinepolis సుధ ఎ/సి - శాలిబండ 7.35PM
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ 7.45PM
MOVIETIME మూవీటైమ్ - అమీర్‌పేట్ 10.45PM
MOVIETIME మూవీటైమ్ ఎ/సి - గచ్చిబౌలి 5.20PM
GPR జిపిఆర్ - కూకట్‌పల్లి 7.10PM
AMB ఎఎంబి - మౌలాలి 1.15,7.15PM
MUTHYALA విజయలక్ష్మి - ఎల్‌బినగర్ 1.30,4.30,7.30,10.30
PRASAD'S ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 5.30PM
AMB ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి 4.15PM
యస్2 ఎ/సి - వరంగల్ | పరమేశ్వరి - కొత్తగూడెం | పివిఆర్ జీవన్ రెడ్డి - ఆర్మూర్
సుందర్‌మ్యాక్స్ - ఖమ్మం | రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి | MYTHRI MOVIE DISTRIBUTORS LLP

నేడే బ్రహ్మాండమైన విడుదల